# కార్పొరేట్ల, ప్రైవేటు మిలటరీ కంపెనీల 'మానవవనరుల' కోసమే అగ్నిపథ్

**అనేక** దేశాలతోపాటు భారతదేశపు త్రివిధ రక్షణ దళాల నిర్వహణలో ప్రైవేటీకరణ క్రమం మొదలై చాలా కాలమైంది. మొత్తం మిలటరీ బడ్జెట్‌లో నుంచి వివిధ విభాగాలకు చేసే కేటాయింపుల విషయంలో సంస్కరణలను ఇప్పుడు ప్రతిపాదిస్తున్నారు. మానవ వనరుల (ఈ భాష ప్రపంచ బ్యాంకుది) నిర్వహణకు అయ్యే ఖర్చు తగ్గించుకోవాలి. సైనికీకరణలో అధునాతన ఆయుధాల కొనుగోలుపైన, వివిధ రకాల మిలటరీ సర్వీసుల కొనుగోలు పైనే ఎక్కువగా ఖర్చు చేయాలని అనేక దేశాలపై ఉన్నట్టుగానే మన దేశంపై కూడా సామ్రాజ్యవాదుల, వారి ఆర్థిక సంస్థల ఒత్తిడులున్నాయి. అంటే సామ్రాజ్యవాదుల ఆయుధ వ్యాపారంతో, వారి లాభాలతో నేరుగా ముడిపడినదే ఈ సమస్య. ఆధునిక ఆయుధాల సామర్థ్యం పెరిగే కొద్దీ వాటిని ఉపయోగించే వారి నైపుణ్యాలు కూడా పెరగాలి కదా! ఇలాంటి అధునాతన ఆయుధాలపై పరిశోధన, తయారీ అంతా బడా ప్రైవేటు కంపెనీల చేతుల్లోనే వున్నపుడు వాటిని వాడే సైనికులకు ట్రైనింగ్ కూడా వాళ్లే ఇవ్వాల్సి వుంటుంది. అలా సాగిన ప్రైవేటీకరణ క్రమం ఈనాటికి మానవ వనరుల వంతు వచ్చింది.

ఆయుధాలను నిపుణతతో, టెక్నాలజీ సహాయంతో వాడగలిగే 'మానవ వనరులను' మాత్రమే వుంచుకుని మిగిలిన వారిని తొలగించే ప్రక్రియలు మిలటరీలో ఎప్పుడో ప్రారంభమైనాయి. ఏది ఏమైనా మూడవ ప్రపంచ దేశాల బడ్జెట్లలో 30 నుంచి 40 శాతానికి పైగా ఉన్న మిలటరీ బడ్జెట్లను తరలించుకుపోయే ప్రక్రియ మాత్రం మారదు. ఈ మిలటరీ బడ్జెట్ మొత్తంలో ఎక్కువ వాటా ఈ దేశ ఆర్థిక వ్యవస్థలోకి తిరిగి చేరకుండా బహుళజాతి ఆయుధ కంపెనీలకు చేరేలా చూస్తున్నారు. ఈ తరలింపులు పెంచుకోవడానికే రకరకాల మార్గాలను వెతుకుతున్నారు.

పెట్టుబడిదారీ వర్గాలు తమ సహజ గుణమైన లాభాల దృష్టితో చూసినపుడు ఈ రక్షణ రంగం కూడా నిరుద్యోగాన్ని అంతో ఇంతో తీర్చేదిగా, రిజర్వేషన్లను పాటించే పబ్లిక్ సెక్టార్‌గా ఇంకెంతమాత్రం కొనసాగరాదు. తమ లాభాలకు అడ్డు వస్తుంద నుకున్నపుడు తాము గొప్పగా చెప్పుకునే ప్రజాస్వామ్యం, తామే రూపొందించిన రాజ్యాంగాలలోని నిబంధనలను కూడా ఈ నిరంకుశాధికార పెట్టుబడిదారీ వర్గం మార్చేయగలదు. భారత దళారీ పాలకులు సామ్రాజ్యవాదుల ఆజ్ఞలను ఖచ్చితంగా అమలు చేసే వారే కనుక మిలటరీ బడ్జెట్లలో ఇప్పుడు ఖర్చు చేస్తున్న పద్దులను మార్చాలని చూస్తున్నారు. 2005 తర్వాత కొత్త పెన్షన్ విధానంలోకి రాకుండా పాత పెన్షన్ కేవలం త్రివిధ దళాల సైనికులకు మాత్రమే ఇప్పటివరకు కొనసాగుతున్నది. వివిధ హోదాలలోని సైనికులకు, ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ల పైన; వీరసైనికులకు రివార్డులపైన కోట్లకు కోట్లు ఖర్చు చేయరాదన్న సామ్రాజ్యవాదుల ఆజ్ఞలను అధికార పక్షం దాచాలని చూస్తున్నది. అగ్నిపథ్ ఒక కొత్త పాలసీగా మాత్రమే చూపిస్తున్నారు. అనేకరకాలుగా పెరిగిన సాధారణ సంక్షోభంలో నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తూ బడా పెట్టుబడిదారీ శక్తుల కనుసన్నలలో నిర్ణయాలు తీసుకుంటూ కొత్త సమస్యలను ప్రజలపై రుద్దుతున్నారు. ఈ అగ్నిపథ్ పథకంతో దేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీల వంటి రాజకీయ నాయకులకు తప్ప ఇంకెవ్వరికీ పెన్షన్ అనే పదమే ఉండొద్దన్నది పాలకుల విధానం. అన్ని రంగాల్లో ఉన్నట్టుగానే 'కాంట్రాక్టు లేబర్'ని రక్షణ రంగంలోకి ప్రవేశపెట్టడానికే ఈ మహత్కార్య ప్రచారం. 30 సంవత్సరాలు దాటడం అంటే సహజంగా పెట్టుబడిదారీ రక్తపిపాసుల దృష్టిలో పనిచేసే సామర్థ్యం అయిపోయినట్టే. తల్లిపాలశక్తితోపాటు మానవ జీవితంలో అత్యంత కీలకమైన వయసులో అత్యంత ఎక్కువ శ్రమను పిండుకుంటే కానీ వారి శ్రమదోపిడీ దాహం తీరదు. ఈ వాస్తవాలను దాచిపెట్టి రష్యా మిలటరీలా మానవశక్తి అవసరం లేదని ఉక్రెయిన్ సైన్యంలా యూరప్ దేశాలిచ్చిన ఆయుధాలు ఉపయోగించగలిగే వాళ్లను తయారు చేయడమే తమ లక్ష్యమని రక్షణ రంగాల అధికారులు ప్రకటిస్తున్నారు. అందుకే 17 సం॥ నుంచి ఉరకలెత్తే రక్తంతో అలుపు సలుపూ లేకుండా పనిచేసే వారితోనే పని చేయించుకుని నాలుగేళ్లకోకసారి అగ్నివీరులకు ఉద్వాసన కలిగిస్తారు. ఆజ్ఞాపిస్తే మంటల్లో దూకడానికైనా, ప్రజల్ని మంటల్లోకి నెట్టడానికైనా సంసిద్ధంగా వుండే మిడతలదండుని సృష్టించడం; అలాంటి వారితో ప్రైవేటు అద్దె రక్షణ దళాల నిర్మాణం చేసుకోవడం; ఆ దళాల శ్రమను, ప్రాణాలను ఫణంగా పెట్టి కొత్త వ్యాపారాలను ప్రారంభించడమే అగ్నిపథ్ పథక ప్రధానోద్దేశ్యం. దక్షిణాసియా లో ఆఫ్ఘనిస్తాన్ నుంచి తమ సేనలను అమెరికన్ పౌరుల వత్తిడితో వెనక్కు తీసుకున్నప్పటి నుంచి తన చేతికి మట్టి, మరక అంటకుండా వుండే యుద్ధాల కొనసాగింపు మీద పెంటగన్ దృష్టి పెట్టింది. దక్షిణాసియాలో పెరుగుతున్న సంక్షోభాలు అవి సృష్టించబోయే అనర్థాలు, అశాంతిని దృష్టిలో వుంచుకుని సామ్రాజ్యవాదులు తమకు నమ్మిన బంటులుగా వుండే దేశపు పాలకుల కోసం చూస్తున్నారు. చైనా మానవ వనరులను ఎదుర్కోవాలంటే వారికి కనిపించేది భారతదేశమే. అందుకే భారత దళారీ పాలకులతో కలిసి ప్రైవేటు మిలటరీ కంపెనీల తయారీకి కావల్సిన మానవ వనరుల ముడిసరుకును ప్రజల

సొమ్ములతో తయారుచేసే ఈ పథకం రూపకల్పన చేశారు. ఈ పథకానికి జాతీయ పెట్టుబడిదారీ లాభ లక్ష్యాలు, అంతర్జాతీయ సామ్రాజ్యవాద యుద్ధ ప్రయోజనాలు ఉన్నాయి. ఇలాంటి పథకాలన్నీ పాలకులకు నేటి ఆర్థిక, రాజకీయ సంక్షోభ పరిస్థితులు సృష్టించిన తక్షణావసరాలే.

ఇటీవల వెలువడిన ఈ అగ్నిపథ్ పథకం ప్రకటన మిలటరీలోకి సాధారణంగా వివిధ రాష్ట్రాల నుంచి పాత విధానంలో ప్రవేశించే నిరుద్యోగులకు కోపం తెప్పించింది. ఈ ఉద్యోగాలను తమకు, తమ కుటుంబాలకు శాశ్వత జీవన భద్రత కల్పించేవిగా, తమకున్న దేశభక్తిని చాటుకునేవిగా భావించే యువత ది బెస్ట్ అవడం కోసం రక్తం ఆవిరి చేసుకుని అన్ని విధాలుగా వారు పెట్టిన కఠిన పరీక్షల్లో నెగ్గారు. వ్రాత పరీక్ష కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. అనేక సార్లు వాయిదా పడ్డ ఆ పరీక్ష ఇక లేదని తెలిసి దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ కేంద్ర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే ఆందోళనా మార్గాలను ఎంచుకున్నారు. ఉద్రిక్తతను గమనించిన పాలకులు 10 శాతం రిజర్వేషన్లు, చనిపోతే కోటి రూపాయల నష్టపరిహారం వంటి ఆఫర్లు ప్రకటించారు. అగ్నివీరుల్లో నుంచి 25 శాతం మందిని రెగ్యులర్ మిలటరీగా నియమిస్తామని నమ్మబలుకుతున్నారు. వీరిచ్చే ఈ హామీ వంటగ్యాసు సబ్సిడీ మహిళల ఖాతాలలో వేయడం లాంటిదేనని యువత గమనిస్తున్నారు. 25 అంకె క్రమక్రమంగా 5 శాతానికో, 2 శాతానికో చేరుతుంది. కానీ పూర్తిగా పోదు. ఆదేశాలిచ్చే ధనికవర్గాల వారి పిల్లల కోసం ఈ శాశ్వత మిలటరీ ఉద్యోగాలు కావాలి. మరొకవైపు దేశభక్తి, దేవుని భక్తి పేరుతో బడుగు, బలహీనవర్గాల పిల్లలపై వ్యాపారం చేసుకోవడానికి, అవసరమైనప్పుడు వారిని బలిపెట్టడానికి బడా కంపెనీలు తయారవుతున్నాయి. ఆ కంపెనీలిచ్చే గ్యారంటీతోనే పాలకులు యువత కోపాగ్నిని చల్లబరిచేందుకు వచ్చే నాలుగేళ్లలో ఒక లక్షా యాభై వేలమందిని రిక్రూట్ చేస్తామని, నిరసనలు, అల్లర్లలో పాల్గొంటే యువత ఆ అవకాశాలు కోల్పోతారని భయపెడుతున్నారు. ఇది దేశంలో ఉన్న నిరుద్యోగుల దయనీయ స్థితిని, వారిలో గూడుకట్టుకుని వున్న ఆగ్రహాన్ని తెలుపుతోంది.

పాలకులు దేశంలో ఉన్న ప్రభుత్వ రంగాలన్నింటిని ఒక్కొక్కటీ ప్రైవేటీకరణ వైపు నడిపిస్తుంటే, పెట్టుబడిదారీ వర్గాల తీయటి మాటలనే వల్లె వేసే మీడియా, మెజారిటీ ధనిక వర్గాలు; ఉన్నత, మధ్యతరగతి వర్గాలలోని నోరు గల సెక్షన్లు పనిగట్టుకుని ఈ తరహా ప్రైవేటీకరణలను, వ్యాపారీకరణను సమర్థిస్తూ వచ్చాయి. ఎదురేలేదన్నట్టుగా అన్ని రంగాలలో దేశ, విదేశీ కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం పెరుగుతూ వచ్చి మిలిటరీ ప్రైవేటీకరణలో మానవ వనరుల ఘట్టం ముందుకొచ్చింది. గడచిన 50-60 సంవత్సరాలుగా బలపడుతూ వచ్చిన దళారీ బూర్జువా వర్గం సామ్రాజ్యవాదులతో దానికున్న బంధాన్ని బయట పెట్టుకుంటూనే వస్తున్నది. ఈ క్రమంలో తమకు అన్ని విధాలుగా స్థానిక స్థాయిలో సమర్థకులుగా నిలిచే మధ్యతరగతిలో కూడా కొన్ని దళారీశక్తులను సృష్టించుకుంటున్నారు. దోపిడీ సొమ్ములో అంతో ఇంతో ముట్టజెప్పుతూ తమకు రక్షణగా నిలుపుకుంటున్నారు. ఈ ఎంగిలి మెతుకులకు ఆశపడే సెక్షన్లే తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేశ ప్రజలందరిని కష్టాల్లోకి నెట్టడంలో సహకరిస్తున్నారు. పాలకుల ప్రకటనల్లోని దేశ రక్షణ, దేశభక్తి ఇవన్నీ కేవలం ప్రజలను మోసం చేయడానికేనని మరొకసారి రుజువైంది. ఇప్పుడు అంతర్జాతీయంగా వచ్చిన అనేక పెట్టుబడిదారీ సంక్షోభాలు, వాటి విపత్కర పరిణామాలే మన దేశ పాలకులను కూడా మిలటరీ ప్రైవేటీకరణ వైపుకి నడిపిస్తున్నా యన్నది మనం మర్చిపోరాదు. ఏవొక్క అంశమూ విడివిడిగాలేదు. అన్ని జాతీయ, అంతర్జాతీయ సమస్యలూ, సంక్షోభాలూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.

## పెరుగుతున్న అసమానతలు – బడా పెట్టుబడిదారీవర్గాల సేవలో పాలకులు :

మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల అమలు ఫలితంగా పెరుగుతున్న సంక్షోభం, అందులో భాగంగా అసమానతలు తీవ్రస్థాయికి చేరుతున్నాయి. ఒకవైపు అదానీ వంటివారి ఆస్తులు లక్షల కోట్లకు పెరుగుతుంటే, గడచిన ఒక్క మే నెలలోనే పనికి ఆహార పథకంతో రోజూ పొట్టపోసుకునే వారి సంఖ్య మూడు కోట్లకు పైకి చేరింది. బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకు లోబడి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నాశనం చేసుకుంటూ వచ్చినందువల్లనే ఈనాడు ఇంతగా నిరుద్యోగం పెరిగింది. పైకి కనిపించని, అలా అనిపించని ఆకలిచావులు పెరిగాయి. పని కోసం ఎక్కడికైనా వలసలు పోవడానికి సిద్ధంగా వుండే చౌక శ్రామికుల సమూహాలను సృష్టించడంలో భాగంగానే వ్యవసాయాన్ని దండగగా మార్చేశారు. ఎంత ప్రమాదకర పరిస్థితుల్లోనైనా, ఏమైనా చేయడానికి తెగబడే విధంగా శ్రామిక వర్గాల రెక్కలను విరిచేస్తున్నారు. ఇలా ఓడింపబడిన కోటానుకోట్ల శ్రామిక సైన్యాలు తమ పెట్టుబడుల కోటల్లోకి చొరబడతారేమోనని వారు సందేహిస్తున్నారు. వ్యక్తిగత ఆస్తుల కేంద్రంగా వారే నిర్మించుకున్న ప్రజాస్వామిక రక్షణ కవచాలపై వారికే నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి. ఎందుకంటే ఇప్పుడు వారివి వ్యక్తిగత స్థాయి ఆస్తులు ఇంకెంత మాత్రం కాదు. చిన్న సామంతరాజులను పోలిన కంపెనీల ఆస్తులు. వీరు ఆశిస్తున్నట్టుగా ప్రైవేటు సైనిక రాజ్యాల క్రమం మొదలైతే ఆయా దేశాల రాజ్యాంగాలలో ప్రజలకు కల్పిస్తామని చెప్పిన మానవ హక్కులే కాదు ఏ హక్కులైనా రాతల్లో కూడా మిగలవు.

ఇప్పటికే పేద దేశాల వనరులను కొల్లగొట్టడం కోసం ఆయా దేశాల ఆర్థిక, సైనిక, రాజకీయ నిర్ణయాలపై పట్టు బిగించడంలో భాగంగా ప్రత్యక్ష, పరోక్ష దురాక్రమణ యుద్ధాలకు సామ్రాజ్యవాదులు తెగబడుతున్నారు. వివిధ కూటములుగా

గాని, ఆధిపత్య రాజ్యాలుగా గాని ఈ యుద్ధాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో అవి తమ దేశ రాజ్యాంగాలలోని హామీల మేరకు కూడా నడుచుకోలేవు. అమెరికా, ఇజ్రాయిల్ వంటి దేశాలు ఇందుకు స్పష్టమైన ఉదాహరణలు. తమ దేశాలలో పెరిగిన సంపదలు ఒకవైపు దారిద్ర్యం మరొకవైపు అంతరాలను పెంచి ప్రైవేటు కార్పొరేట్ సామ్రాజ్యాలు విస్తరిస్తున్న కొద్దీ వారి ఆస్తుల రక్షణకు సైతం ప్రైవేటు మిలిటరీ కంపెనీలపై ఆధారపడటం పెరిగింది. ఈ దేశాలలో ఆయుధాల వ్యాపారం ఆర్థిక వ్యవస్థలో కీలక అంశమై యుద్ధాలు సృష్టించాల్సిన, చేయాల్సిన అవసరాన్ని పెంచింది. క్రమంగా ప్రభుత్వ మిలిటరీతో పాటు ప్రైవేటు మిలటరీ సేవలు వీరి అవసరంగా మారాయి. ఈ ప్రైవేటీకరణ మొదట టెక్నాలజీ, ఆయుధాలు, రీసెర్చ్, ట్రాన్స్‌పోర్టు, మిలటరీలో వైద్యం, మిలటరీలో ఆహారం తదితర రంగాల్లో ప్రారంభమై కిరాయి (అద్దె) సైనికులు లేదా అవుట్‌సోర్సింగ్ సైనికుల దాకా చేరింది.

## ప్రైవేటు మిలటరీ కంపెనీలు (PMCs) :

1990 తర్వాత స్థానిక అంతర్యుద్ధ అనుభవాలను తమ కనుకూలంగా మార్చుకుని సామ్రాజ్యవాద శక్తులు 'ది సౌత్ ఆఫ్రికన్ మిలిటరీ కంపెనీ' అనే ప్రైవేటు మిలిటరీ కంపెనీ (PMCs)ని ఏర్పరిచారు. సిరియా అంతర్యుద్ధంలో ఉప యోగించారు. ఈ పరిణామాల్లో ఆఫ్రికాలో క్రమంగా పెరిగిన బీభత్సం తర్వాత వీటిని రద్దు చేశారు. సెప్టెంబర్, 2001 దాడుల తర్వాత మళ్లీ టెర్రరిజంపై పోరు పేరుతో అమెరికా ఈ ప్రైవేటు మిలటరీ సేవలు అందించే కంపెనీలను బాగా మార్కెట్లోకి తెచ్చింది. డబ్బు కోసం ఎక్కడికైనా వెళ్లి యుద్ధాలు చేసే సైన్యాలను వివిధ దేశాలలో తయారు చేసుకునే విధంగా ప్రోత్సహించింది. ప్రధానంగా ఇజ్రాయిల్ వంటి దేశాలను ముందు వరుసలో నిలబెట్టింది. ఇజ్రాయిల్ ఇలా నిర్మించిన ప్రైవేటు సైన్యాల కంపెనీలతోనే పాలస్తీనా భూభాగాలలో నిరంతర మారణహోమాలను కొనసాగిస్తున్నది. ఐక్యరాజ్య సమితికి సమాధానం చెప్పుకోవాల్సి రాకుండా, ఆంక్షలకు దొరకకుండా చేసుకోగలుగుతున్నది.

చిన్న చిన్న దేశాల భూభాగాన్ని, సముద్రాల్లో లెక్కలేనన్ని స్థిర, చరాస్తులను కూడబెడుతున్న కార్పొరేట్ శక్తులకు ఆయా దేశాలలోని స్థానిక మిలటరీకి రక్షణ కల్పించే సామర్థ్యం లేకపోయినా ఈ ప్రైవేటు సర్వీసుల ద్వారా రక్షణ కల్పించ గలమన్న హామీని, గ్యారెంటీని కంపెనీలకు సామ్రాజ్యవాదులు ఇస్తున్నారు.

2000 సం॥ ముందు జరిగిన ఆఫ్ఘన్, ఇరాక్ యుద్ధాలలో వివిధ రకాల మిలటరీ అవుట్‌సోర్సింగ్ సేవలు వివిధ విభాగాలలో ఉపయోగించారు. అంటే 'కాంబాట్ సపోర్టు' పేరుతో వివిధ సేవల్లో ఉపయోగిస్తూ వచ్చారు. యుద్ధాల సమయంలో నేరుగా దాడులు చేసేది మాత్రం అమెరికన్ సేనలే చేస్తూ వచ్చాయి. కాలక్రమంలో పిఎంసీలలో ఉద్యోగులుగా చేరుతున్న మాజీ మిలిటరీ అధికారుల ఒత్తిడులతో నేరుగా దాడులు చేయడంలో కూడా ఉపయోగిస్తున్నారు.

మిలటరీ సేవల్లో లాభాలు పొందే ఈ తరహా పీఎంసీలు అమెరికా రక్షణ శాఖ ముందుకు ఆకర్షణీయమైన ఆఫర్లతో వెళ్ళాయి. మీ ప్రభుత్వాలు నేరుగా వుపయోగించే సొంత ఉద్యోగులైన సైనికుల కన్నా మా కంపెనీలు సప్లై చేసే అవుట్ సోర్సింగ్ సైనికులు తక్కువ ఖర్చుతో ఎక్కువ సేవలు అందిస్తారు. కాంట్రాక్ట్ సైనికులకు గాయాలైనా, చనిపోయినా మీరు ఏమీ చెల్లించ నవసరంలేదు. అమెరికా ప్రజల నుంచి సాధారణంగా సైనికుల మరణాలపై వచ్చే వ్యతిరేకత ఈ సైనికుల చావుల వల్ల రాదు. వారు ఈ యుద్ధంలో తమంతట తాము డబ్బు కోసం తెలిసే వెళ్లి చనిపోయారు అనుకుంటారు. అనేక యుద్ధాలలో దేశ సైనికులని బలి పెట్టారన్న విమర్శలు మీకు ఇకపై రావు అని వారితో ఒప్పందాలు చేసుకోగలిగారు. ఇటీవలి సంవత్సరాల్లో అమెరికా, దాని మిత్రులు చేసిన యుద్ధాలలో లెక్కలోకి రాని ఇలాంటి కిరాయి సైనికుల చావులు చాలానే ఉన్నాయి. ఆఫ్ఘనిస్తాన్ నుండి ఖాళీ చేసే సందర్భంలో ఇలాంటి పిఎంసీలు తక్కువ సైనికుల్ని పంపి ఎక్కువ డబ్బు లాగారని, అవినీతిలో మిలటరీ అధికారులకు వాటాలు వున్నాయనే వార్తలు కూడా వచ్చాయి.

'కాన్ స్టెల్లిస్' గ్రూప్‌కి చెందిన 'అకాడమి' ఇది ఒకప్పుడు 'బ్లాక్ వాటర్'గా పిలువబడేది. ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ మిలటరీ సర్వీసులను అందిస్తున్న గ్రూపుల కన్సార్టియం. HQ అనేది మరొక కంపెనీ. దీని ప్రధాన క్లైంట్ అమెరికా మిలటరీయే. ఈ కంపెనీ అమెరికన్ మిలటరీ వేసే టెండర్లలో పాల్గొని ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలలో అమెరికన్ మిలటరీతో కలిసి వివిధ రకాల సేవలు అందించే కాంట్రాక్టులు పొందింది. ఈ ఒక్క కంపెనీకే 20 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. సొంత విమానాలు, విమానాశ్రయాలు ఈ గ్రూపు కలిగి ఉంది. ఈ రంగంలో ఇటీవల వెలుగుచూసిన అనేక అవినీతి కథనాలు కూడా ఈ గ్రూపువే. ఇదే గ్రూపు చైనా సిల్క్ రూట్ నిర్మాణంలో సర్వీసెస్ కోసం కాంట్రాక్టు పొంది తమ దేశ ప్రయోజనాలు ఈ కంపెనీ దెబ్బతీసిందని కూడా అమెరికా ఆరోపిస్తుంది. ఈ ప్రైవేటు మిలటరీ కంపెనీలు ఎంతదాకా ఎదిగాయో చెప్పాలంటే ఆశ్చర్యమేస్తుంది. ఉక్రెయిన్ నుంచి క్రిమియా భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి 2014లో రష్యా తమ దేశానికి చెందిన ప్రైవేటు మిలిటరీ కంపెనీ అయిన 'వేగనార్' సేవల్ని వుపయోగించుకుంది. కానీ క్రిమియాలోని రష్యా అనుకూల ప్రజలు ఈ మిలటరీ సర్వీసెస్‌ను వుపయోగించుకుని తమకు సహకరించారని రష్యా వాదిస్తోంది.

ప్రపంచంలో చాలా దేశాలు ఈ పిఎంసిలపై ఆధారపడటం పెరిగింది. సాధారణ మిలటరీ సేవల కన్నా ఈ ప్రైవేటు మిలటరీ

సేవలను వుపయోగించుకోవడం వల్ల ఆయా దేశాల పాలకవర్గాలు లాభపడుతూ సొంత లాభాలు పోగేసు కుంటున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు ఆయుధాల వ్యాపారంతో పాటు మానవవనరుల సేవల వ్యాపారం ద్వారా కూడా లక్షల కోట్ల మార్కెట్ సృష్టించుకుంటున్నాయి. ఈ పరిణామ క్రమంలోనే ఈనాటి అగ్నిపథ్‌ని చూడాలి.

**రక్షణ రంగాలలో ప్రైవేటీకరణ :**

వాజ్‌పేయి కాలంలో నేరుగా మొదలైన రకరకాల ప్రైవేట్ మిలటరీ సేవలు ఇప్పుడు, నిరుద్యోగులుగా నాలుగేళ్ల తర్వాత బయటకు వచ్చే అగ్ని వీరులను సృష్టించే అగ్నిపథ్‌గా రూపం తీసుకున్నది. రాబోయే కాలంలో ప్రైవేటు మిలటరీ కంపెనీలను ఏర్పాటు చేయడానికి ఏ అంబానీనో, అదానీనో ఈ పాటికే తయారై ఉంటారు.

దేశం కోసం మేం చావడానికైనా సిద్ధం అంటూ టీవీల ముందు ఉత్తమ దేశభక్తిని చాటే యువకులే ఈ కంపెనీలకు రేపటి మానవ వనరులన్నమాట. బడా కార్పొరేట్ సంస్థల పరమైన ప్రైవేటు రైల్వేలు, ప్రైవేట్ గనులు, ప్రైవేటు అడవులు, ప్రైవేటు వ్యవసాయ భూములతో కూడిన వేల ఎకరాల ఎస్టేట్లు, ప్రైవేటు సరుకుల, ధాన్యపు గోదాములు, ప్రైవేటు రవాణా వాహనాలకు కాపలా కాయడాన్ని దేశభక్తిగా రెగ్యులర్ సైన్యంలోకి చేరుతున్న ఈ యువత భావించదేమోననే సందేహం కార్పొరేట్లకు కలిగింది. రైతు ఉద్యమ నేపథ్యంలో జై కిసాన్ అంటూ జవాన్లు సంఘీభావంగా జైకొట్టి నిలవడం, ప్రధానంగా సిక్కులు ఈ మిలటరీలో వివిధ స్థాయిల్లో వుండడం కూడా వీరి అనుమానానికి బలాన్ని చేకూర్చి ఉండవచ్చు. సామ్రాజ్యవాదుల పైన ద్వేషం, దేశ ప్రజలపైన ప్రేమ ఎప్పుడైనా, ఏ కొందరికైనా కలిగి సిపాయిల తిరుగుబాట్లుగా మారే ప్రమాదాన్ని కూడా సామ్రాజ్యవాదులు నివారించుకోదలచుకున్నారు. వారి సేవకులైన భారత పాలకులు రకరకాల ఉన్మాదాన్ని మనసులోకి ఎక్కించుకున్న తమకు కావాల్సిన ప్రైవేటు మిలటరీ సేనలకు మానసికంగా, శారీరకంగా తర్ఫీదు ఇచ్చి సిద్ధం చేసుకొనేందుకే 'అగ్నిపథ్'ని ఇప్పుడు ప్రకటించి ఉండొచ్చు.

అగ్నిపథ్ తెస్తున్నందుకు భారత పారిశ్రామిక వర్గాల సమాఖ్య (CII) మోడీకి ధన్యవాదాలు తెలియజేయడం ఇందులో భాగమే. భవిష్యత్తులో భారతదేశ పరిశ్రమలకు సరైన రక్షణ కొరకు, దేశ నిర్మాణం కొరకు క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన అగ్నివీరుల సేవలు ఆశిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగానికి తోడుగా సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌కి సులభంగా దొరికే అగ్నివీరుల సహకారం పరిశ్రమలకు ఎంతో వుపయోగమని వారు రాతపూర్వక సందేశం పంపారు. ఈ దేశంలో పరిశ్రమలకు కావచ్చు, ప్రపంచంలో విస్తరిస్తున్న తమ ఆస్తులన్నింటికీ రక్షణగా కావచ్చు. ఆయుధాలతో శిక్షణ పొందిన కారుచౌకగా లభించే ప్రైవేటు సైనికులను వారు కోరుకుంటున్నారు. ఈ మాత్రం ప్రజాస్వామ్యం వున్నా, కొంతైనా రాజ్యాంగబద్ధంగా వున్నా కూడా పెరిగిన అసమానతలను సృష్టించే వైరుధ్యాలను, రాను రాను పదునెక్కుతున్న స్థితిని తట్టుకోలేమని వారు భావిస్తూ వుండవచ్చు. వారనుకుంటున్న స్థాయి పూర్తి రక్షణ వారికి ఇప్పుడు లేదనే పరోక్షంగా ప్రకటించారు.

ఈ అగ్ని వీరులను ఎగుమతి చేసే కంపెనీలను తామే స్థాపించి 140 కోట్ల భారతీయుల నుండి కోట్లాది యువతకు ఉపాధి కల్పిస్తామని మహీంద్రా కంపెనీతోపాటు ఇంకా ఎవరు ముందుకొస్తారో వేచి చూడాలి. విదేశాలలో జరగబోయే యుద్ధాలకు కిరాయి సైనికులుగా పంపడం ద్వారా చాలా విదేశీ మారక ద్రవ్యం డాలర్లుగా సంపాదించవచ్చని కూడా రేపు CII వారు ప్రకటిస్తారు కాబోలు. జూలై 1 నుంచి అమలులోకి రాబోయే 12 గంటల పనితో నోరు మెదపకుండా పని చేసుకుంటూ పోయే బానిస శ్రామికులను అందించినందుకు ఇప్పటికే పాలకులకు తమ సంతోషాన్ని వారు వ్యక్తపరిచారు.

ఈ సామ్రాజ్యవాద శక్తులు, పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థకులంతా దాచిపెట్టే అంశమే దాని దోపిడీ లక్షణం. దాని పొట్టలోనే వున్న దాని సంక్షోభం. అన్నిరకాల వనరుల్ని, చివరికి ప్రకృతి వనరుల్ని సైతం సర్వనాశనం చేసే ఈ క్రూరమైన దోపిడీ వ్యవస్థ, దాని యజమానులు పాత తరహా ఫ్యూడల్ రాజ్యాలకు వలే సొంత సైన్యాలను డిమాండ్ చేయడమే కొత్త పరిణామం.

సామ్రాజ్యవాదాన్ని ఓడించకుండా పీడిత దేశాలకు, పీడిత ప్రజలకు విముక్తి లభించదు. సామ్రాజ్యవాదాన్ని నిజమైన అర్థంలో ఓడించడం అంటే దాని ఆర్థిక, సైనిక, రాజకీయ ప్రయోజనాలను నిరంతరం కాపాడే స్థానిక దళారీ దోపిడీ శక్తులను అన్ని విధాలుగా ఎదుర్కోవడం. పీడిత వర్గాలు అన్ని రూపాలలో ఈ శక్తులను ఓడించడం ద్వారానే అది సాధ్య పడుతుంది. నిరుద్యోగ యువతకు గాలం వేస్తూ మతతత్వ శక్తులతో అరాచక గుంపులతో నిండిన ప్రగతి నిరోధక ప్రైవేటు సైన్యాన్ని నిర్మాణం సాగించడం ద్వారా భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదులతో మరింత ఎక్కువ స్నేహాన్ని, వారి ప్రాపకాన్ని పొందాలని చూస్తున్నారని అర్థం చేసుకోవాలి. యువత ఈ దోపిడీ వ్యవస్థ సమూల మార్పు కొరకు సాగే వర్గపోరాట కృషిలో నిమగ్నం కావాలి. కేంద్ర, రాష్ట్రాల పాలకులు వేసే రకరకాల ఉచ్చులలో చిక్కుకో రాదు. ప్రజల పక్షాన నిలిచి ప్రజా పోరాట వీరులుగా ఉద్యమ ప్రజలతో నడవాలి.

*****